# ఓ సగటు కథ

(జ్యోతి, దీపావళి సంచిక)

మొదటి రోజున ఫ్రెండ్స్ బలవంతం చేశారన్నాడు !

మరోమాటు ఆఫీసులో పార్టీ అన్నాడు !

తర్వాత బీరుతాగితే ఫర్వాలేదన్నాడు !

ఆ తర్వాత 'నా ఇష్టం! నేను తాగుతాను,

నువ్వెవరివి నాకు చెప్పటానికి ?" అన్నాడు.

ఇది ఈ దేశంలో ఒక సగటు కథ....

# ఓ సగటు కథ

జగన్నాథం విసురుగా లేచి నిలబడ్డాడు.

తన వెనుకనున్న కుర్చీని ఎడంచేతితో తోసి పారేశాడు.

ఎదురుగా డైనింగు టేబిలుమీది ప్లేటులోని భోజనం వంక ఒక్క క్షణం చూశాడు.

"చికెనేదీ? చికెనంటే అర్థమయిందా? కోడికూర!" ముద్దగా మాట్లాడుతూ భార్య వంక చూసేడు.

జానకి బిత్తరపోయి అతడి వంక చూస్తూ గోడకు ఆనుకుని నిలబడిపోయింది.

"వినబడుతోందా?" అడిగేడు మళ్ళీ.

జానకి తలవూపింది.

"నీకు మధ్యాహ్నం, చెప్పేనా లేదా?"

"చెప్పేరు" తలవొంచుకుని కాలి బొటన వేలితో నేలమీద రాస్తూ అంది జానకి.

"మరి, వండలేదేం ?"

డైనింగు టేబిలుమీద చేతితో చరిచి మరీ అడిగేడు.

"సాయంకాలం పనిమనిషి రాలేదు. బజారునుండి తెప్పించాలంటే ఎవ్వరూ దొరకలేదు. అందుకని వండలేదు. రేపు తప్పకచేస్తాను" సంజాయిషీ ఇచ్చుకుంది జానకి.

"మాట్లాడకు మరి! నేను వండమంటే ఆరునూరయినా వండాలి. అంతే! అది రూలు. అర్థమయిందా ?"

మొండిగా అడిగేడు.

"అర్థమయింది"

"మరి వండలేదేం ?" మళ్ళీ మొదటి కొచ్చేడు జగన్నాథం.

జానకి అతడి వంక రెండు క్షణాలు చూసింది.

ఆమెకు ఏం మాట్లాడాలో పాలుపోలేదు.

అతని మొండితనం చూస్తే ఆమెకు మతిపోతోంది.

జగన్నాథం కోపంగా ఎదుటిప్లేటు తోసిపారేశాడు!

అది వెళ్ళి గోడకు కొట్టుకుని పెద్ద శబ్దంతో నేలమీద పడిపోయింది.

ప్లేటులోని అన్నమంతా నేలమీద చెల్లాచెదురుగా పడిపోయింది. కూర, చట్నీ అన్నీ చిందర వందరగా ఒలికిపోయాయి.

జానకి కంట్లో నీళ్ళు తిరిగేయి.

రాత్రి పదకొండు గంటలవరకూ భర్తకోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని నిరీక్షించి —

వేడి వేడిగా అన్నం వండిపెడితే, ఆఖరికి మిగిలింది ఇదా?

జగన్నాథం విసురుగా నడవబోయాడు.

తూలిపడబోయి డైనింగు టేబిలు పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

తర్వాత గోడను ఆసరా చేసుకుని బెడ్‌రూంవైపు నడవబోయాడు.

అతడికి అడుగులు పడటంలేదు!

నాలుగడుగులువేసి కుప్పలా కూలిపోయాడు !

జానకి గబగబా వెళ్ళి అతడి భుజాలు పట్టుకుంది.

"వదులు! నాకేం కాలేదు ! మరీ అంత ఎక్కువ తాగలేదులే!" అంటూ ఆమె చేతులు తొలగించబోయాడు.

అంతలోనే భళ్ళున వాంతి చేసుకున్నాడు.

జానకి అతడిని రెండు చేతులతోనూ పట్టుకుంది.

ఆ దుర్వాసన భరించటం మహాకష్టమయింది ఆమెకు.

జన్మలో ఇలాంటి వాసన చూడలేదు!

మెల్లగా అతడిని లేవదీసి వాష్‌బేసిను దగ్గరకు తీసుకువెళ్ళి నోరూ, ముఖమూ కడిగింది.

తడితువ్వాలుతో చొక్కా శుభ్రం చేసింది.

జగన్నాథం మరి మాట్లాడలేదు!

ఆమె తుడుస్తూ వున్నంత సేపూ ఆమె భుజాలు పట్టుకుని నిల బడ్డాడు.

తర్వాత అతడిని మెల్లగా నడిపించుకుని తీసుకువెళ్ళి పరుపుమీద పడుకోబెట్టి ఫేను వేసింది.

మంచంమీద పడుకున్న రెండు నిమిషాలలోనే పెద్ద గురకతో నిద్ర లోకి జారిపోయాడు జగన్నాధం.

జానకి అతడి వంక చూసి దీర్ఘంగా నిట్టూర్చింది.

గదినుండి బయటకు వచ్చి, తలుపులు దగ్గరగా వేసి, వరండాలోని సోఫాలో కూలబడిపోయింది.

బయట ఆవరణలోనుండి చల్లని గాలి వీస్తోంది.

ప్రకృతి పసుక వెన్నెలలో స్నానం చేస్తోంది.

కొంత సేపు శూన్యంలోనికి చూస్తూ వుండిపోయింది జానకి.

తాను కాపరానికి వచ్చి ఈవేళ్టికి ఎనిమిది రోజులయింది.

ఈ ఎనిమిది రోజుల్లోనూ భర్త ఇలా త్రాగి ఇంటికి రావటం ఇది నాలుగోసారి. కానీ ఇంత అన్యాయంగా మాత్రం ఇంతకు ముందు ప్రవ ర్తించలేదు.

వాంతి చేసుకునేలా త్రాగలేదు!

తాగి వచ్చిన మొదటి రోజున ఆఫీసులో పార్టీ అయిందన్నాడు.

రెండోమాటు ఫ్రెండ్స్‌తో తప్పనిసరి అయిందన్నాడు.

మూడోసారి మరి ఏదో సాకు చెప్పేడు.

ఈవేళ ఆ కారణం కూడా వినిపించలేదు.

పైగా చికెన్ వండనందులకు భోజనం నేలపాలు చేశాడు.

సరిగ్గా రెండు నెలల క్రితం జగన్నాధంతో పెళ్ళిచూపులు జరిగేయి.

అతడు నవ్విన చిరునవ్వులకు పరవశించిపోయింది జానకి!

పెళ్ళిపీటలమీద యెంతో గర్వంగా కూర్చుని మిత్రుల వంక చూసింది. తన అదృష్టానికి తానే మురిసిపోయింది.

తమ పెళ్ళికి ముందే జగన్నాధం తాగుతాడని తెలిసింది.

'ఈ రోజుల్లో తాగటం ఒక ఫేషను' అని సరిపెట్టుకుందిగానీ, ఫలితం యింత అన్యాయంగా వుంటుందని మాత్రం ఊహించలేక పోయింది.

ఇపుడు చింతించి లాభంలేదు !

భర్తను దారిలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించాలి కానీ నిరాశ పడితే లాభం లేదనుకుంది జానకి!

కానీ, అది ఎంతవరకూ సాధ్యం ?

జానకి మనసు అస్తవ్యస్తమయిన ఆలోచనలతో నిండిపోయింది.

మెల్లగా లేచి లోనికి వచ్చి డైనింగు టేబిలు శుభ్రం చేసింది.

బెడ్‌రూంలోకి వచ్చింది.

బెడ్‌లైటు వెల్గించి, పెద్ద దీపం ఆర్పి నేలమీద రెండు తలగడాలు వడేసుకుని, నిద్ర కుపక్రమించింది.

ఉదయాన్నే లేచి, తలంటు పోసుకుని డ్రెస్సింగ్ టేబిలు దగ్గర కూర్చుని తలారబెట్టుకుంటోంది.

టేపురికార్డరు లోంచి మంద్రస్థాయిలో శాస్త్రీయ సంగీతం విని పిస్తోంది.

ముఖం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ వచ్చి ఆమె వెను కగా నిలబడ్డాడు జగన్నాధం.

"సారీ జానీ" అన్నాడు మెల్లగా.

జానకి మాట్లాడలేదు!

"రాత్రి పశువులా ప్రవర్తించేను కదూ!" జానకి భుజంపై అనున యంగా రాస్తూ అడిగేడు.

పెదవివిప్పి మాట్లాడలేకపోయింది జానకి.

రాత్రి జరిగినదంతా జ్ఞప్తికి వచ్చింది.

ఏడవబోయి తమాయించుకుంది.

భర్త తన భుజాలను మృదువుగా నొక్కుతూ వుంటే పరవశించి పోయింది.

అద్దంలో అందమయిన భర్త ముఖం చూస్తూ మధురోహల్లో తేలి పోయింది!

పట్టుకుచ్చులా నిగనిగ లాడిపోతున్న తన కురులను భర్త సవ రిస్తూ వుంటే తన్మయత్వంతో జానకి కళ్ళు మూతలుపడ్డాయి.

మృదువుగా తన బుగ్గతో అతని చేతిని భుజంమీద అదిమిపట్టింది!

"సారీ, జానీ! ఇంకెప్పుడూ తాగను. నీ నల్లని కురులమీద ఒట్టేసి చెబుతున్నాను."

గొణుగుతున్నట్లు ఆమె చెవికి తన నోటిని ఆన్చి మెల్లగా అన్నాడు జగన్నాధం.

"కూర్చోండి! కాఫీ తెస్తాను" అంటూ వంటింట్లోకి తృప్తిగా నడి చింది జానకి!

* * *

"ఏమిటిది? వంకాయకూరా? వరిగడ్డా? ఛీ !" అంటూ ఎదరనున్న కంచాన్ని కాలితో తన్నేసి పీటమీదనుండి లేవబోయి ప్రక్కకు పడ్డాడు జగన్నాధం!

కంచంలోని కూర అన్నం నేలమీద చిందర వందరగా పడి పోయాయి.

కప్పులోని మజ్జిగ నేలపాలయింది!

మెల్లగా నేలమీద చేతులు ఆన్చి నిలబడ్డాడు జగన్నాధం !

తూలుతూ, అడుగులు వేసుకుంటూ జానకి దగ్గరకు వచ్చేడు.

"లం....ముండా! చికెను వండలేదేం ? ముక్క లేకపోతే ముద్ద గొంతు దిగదని నీకు తెలీదా?"

"అహాఁ తెల్దా?" మాటలు తడబడుతున్నాయి.

దగ్గరకొస్తే భరించలేని వాసన!

"తెలుసు"

"మరి, వండలేదేం?"

"డబ్బులు చాలలేదు!"

"జీతమంతా ఏమయిందే లం....ముండా?"

"తెచ్చిన జీతమంతా పదో తారీఖుతోటే అయిపోతోంది. నెలా ఖరులో కూడా చికెన్ కావాలంటే ఎలా వస్తుంది ?"

అసహనంగా అడిగింది జానకి.

"ఎలా వస్తుందో నాకు అనవసరం! నువ్వొండాలి! అది రూలు! అంతే—" అంటూ జానకి జుత్తుపట్టుకుని గట్టిగా గుంజాడు.

అతడి చేతిలోంచి కురులను వదిలించుకుంటూ అతడివైపు అసహ్యంగా చూసింది.

అదేం తనకు పట్టనట్లుగా తూలుతూ గదిలోకి వెళ్ళిపోయాడు జగన్నాథం.

జానకి దీర్ఘంగా నిట్టూర్చింది.

చిందర వందరగా వున్న జుత్తు ముడేసుకుని, పీటతీసి, వంటిల్లు సర్దింది. తర్వాత కంచంలో నాలుగు మెతుకులు వడ్డించుకుని తిని పడక గదిలోకి వచ్చింది.

జగన్నాథం పెద్దగా గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు.

క్షణంసేపు నిలబడి అతడి వంక చూసింది.

ఎంతోసేపు అలా చూడాలని అనిపించలేదు ఆమెకు.

లైటు ఆర్పి వరండాలోకి వచ్చింది.

వరండా మెట్లమీద కూలబడి ఎదురుగా ఆకాశం వంక చూసింది.

ఎక్కడా చంద్రుడు కన్పించటంలేదు !

మబ్బులు బాగా ముసురుకుని వున్నాయి !

అక్కడక్కడ ఒకటి రెండు చుక్కలు మినుకు మినుకు మంటున్నాయి.

తుది మొదలులేని దృశ్యాలు, ముక్కలు ముక్కలుగా కళ్ళముందు మెదిలేయి జానకికి!

ఆలోచనలతో సతమతమవుతూ ఒంటరిగా చాలా సేపు కూర్చుండి పోయింది జానకి.

అర్ధరాత్రి దాటేక గదిలోకి వచ్చి చాపమీద మేనువాల్చింది!

మరునాడు ఉదయం తలంటు పోసుకుని చిక్కుతీసి తల ఆరబెట్టుకుంటోంది జానకి!

పక్కింటి రేడియోలోంచి శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం మెల్లగా వినిపిస్తోంది.

ఎదురుగా గోడకు తగిల్చివున్న చెక్క అద్దంలో తన ప్రతిబింబం స్పష్టంగా కన్పిస్తోంది.

కురులను ముందుకు లాగి దువ్వుకుంటోంది జానకి.

అంతలో అద్దంలో భర్త ప్రతిబింబం కనుపించింది.

అతని కనురెప్పల క్రింద నల్లని గీతలు!

“జానకీ! కాఫీ పట్రా!” అన్నాడు బిరాగ్గా.

“గదిలో కూర్చోండి, కలిపి తెస్తాను” అంది.

జగన్నాథం వెళ్ళిపోయాడు వెనుక నుండి.

జానకి భుజం మీదనుండి ముందుకు పడివున్న పొడుగాటి నిడువయిన తలవెంట్రుకలను పలుచగా విడదీసింది.

వాటినిండా ఎన్నో తెల్లవెంట్రుకలు వెండితీగల్లా మెరుస్తున్నాయి!!